TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-200 | పేజీలు:-4 | శుక్రవారం 03-07-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## 37 ఏళ్ల తర్వాత కొత్త ఎయిర్ ఫోర్స్ వన్

**తొలిసారి ప్రయాణించిన ట్రంప్**

- నార్త్ డకోటాలో థియోడర్ రూజ్‌వెల్ట్ లైబ్రరీ ప్రారంభోత్సవంలో ట్రంప్
- లైబ్రరీకి $750,000 ఫెడరల్ గ్రాంటు ప్రకటించిన ట్రంప్
- వైట్‌హౌస్ నుంచి రూజ్‌వెల్ట్ మెడల్ ఆఫ్ ఆనర్ లైబ్రరీకి తరలింపు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, సుమారు 37 ఏళ్ల తర్వాత ఆధునీకీకరించిన నూతన 'ఎయిర్ ఫోర్స్ వన్' విమానంలో తొలిసారిగా ప్రయాణించారు. నార్త్ డకోటాలో ఏర్పాటు చేసిన థియోడర్ రూజ్‌వెల్ట్ ప్రెసిడెన్షియల్ లైబ్రరీ - మిగతా 2 లో

## తండ్రి అంత్యక్రియలకు మొజ్తబా ఖమేనీ దూరం.. కారణమిదే!

- తండ్రి అలీ ఖమేనీ అంత్యక్రియలకు దూరంగా ఉండనున్న ఇరాన్ కొత్త అధినేత మొజ్తబా
- తీవ్ర భద్రతా ముప్పు కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార ప్రతినిధి వెల్లడి
- మొజ్తబా బయటకు రావాలనుకుంటున్నా భద్రతా దళాలు అనుమతించడం లేదని వ్యాఖ్య



ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ, తన తండ్రి దివంగత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకాకపోవచ్చని తెలుస్తోంది. తీవ్రమైన భద్రతా ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, ఆయన బహిరంగ కార్యక్రమాల్లో - మిగతా 2 లో

## సవాల్ చేసి వెనక్కి తగ్గారు

**చర్చకు దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి: కేటీఆర్**



- చర్చకు సవాల్ చేసిన కాంగ్రెస్ నేతలే వెనక్కి తగ్గారని కేటీఆర్ విమర్శ
- హరీశ్‌రావు అరెస్టును ఖండిస్తూ వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- అప్పులు, గురుకులాల అంశంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్
- తన లెక్కలు తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తానన్న మంత్రి జూపల్లి

రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక - మిగతా 2 లో

# జెడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి దాకా

- ప్రజా జీవితంలో రేవంత్ రెడ్డి ఏ 20 ఏళ్లు
- జెడ్పీటీసీగా రాజకీయ జీవితం ప్రారంభించిన రేవంత్ రెడ్డి 20 ఏళ్లు పూర్తి చేసుకోనున్నారు
- జెడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి దాకా రెండు దశాబ్దాల రాజకీయ జీవితం సందర్భంగా రేవంత్ రెడ్డి మిడ్జిల్ పర్యటన చేయనున్నారు
- రేవంత్ రెడ్డి రెండు దశాబ్దాల రాజకీయ చరిత్ర ఇదే.




తెలంగాణ ముఖ్యమంత్రి పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డి రాజకీయ జీవితం ప్రారంభించి రెండు దశాబ్దాలు పూర్తయ్యాయి. ఒక స్వతంత్ర అభ్యర్థిగా జీవితం ప్రారంభించి అనంతరం రాష్ట్ర అత్యున్నత స్థాయి పదవిని అలంకరించారు. చిన్నగా ప్రారంభమైన అతడి రాజకీయ జీవితం ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. ఉమ్మడి పాలమూరు నుంచి ముఖ్యమంత్రిగా అయిన రెండో వ్యక్తిగా రేవంత్ రెడ్డి చరిత్ర సృష్టించారు. ఆయన రెండు దశాబ్దాల రాజకీయ

## తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్ పోలీసుల అదుపులో హరీశ్ రావు



- గన్‌పార్క్‌కు వెళ్తుండగా తెలంగాణ భవన్ వద్ద హరీశ్‌రావును అడ్డుకున్న పోలీసులు
- బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్తత
- కారు దిగి నడుచుకుంటూ వెళ్లే ప్రయత్నం చేసిన హరీశ్‌రావును అదుపులోకి తీసుకున్న పోలీసులు
- గురుకులాల అవినీతి, రాష్ట్ర అప్పులపై చర్చకు మంత్రులు సవాల్
- చర్చ నుంచి పారిపోవద్దని మంత్రులకు హరీశ్‌రావు ప్రతిసవాల్

గురుకులాల్లో అవినీతి, రాష్ట్ర అప్పుల అంశాలపై చర్చించేందుకు గన్‌పార్క్‌కు బయల్దేరిన - మిగతా 2 లో

# తమిళనాడులో గోవధపై హైకోర్టు నిషేధాన్ని సుప్రీంలో సవాల్ చేసిన విజయ్ ప్రభుత్వం

- హైకోర్టు తీర్పు 1958 జంతు సంరక్షణ చట్టానికి విరుద్ధంగా ఉందని ప్రభుత్వ వాదన
- ఈ తీర్పు మతస్వేచ్ఛను హరిస్తోందని ప్రతిపక్షాలు, ముస్లిం సంఘాల ఆందోళన
- బక్రీద్, హిందూ పండుగల్లో జంతుబలులపై ప్రభావం చూపుతున్న తీర్పు
- సుప్రీంను ఆశ్రయించడంలో జాప్యంపై టీవీకే ప్రభుత్వంపై విపక్షాల విమర్శలు




తమిళనాడులో గోవధపై మద్రాస్ హైకోర్టు విధించిన సంపూర్ణ నిషేధాన్ని సవాల్ చేస్తూ, నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పు రాష్ట్రంలో అమలులో ఉన్న చట్టాలకు విరుద్ధంగా ఉందని, మతపరమైన ఆచారాలకు ఆటంకం కలిగిస్తోందని ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ వ్యవహారం ప్రస్తుతం తమిళనాట రాజకీయంగా

## మహారాష్ట్ర రాజకీయంలో పెను సంచలనం

**కాంగ్రెస్‌లో విలీనం కానున్న శరద్ పవార్ పార్టీ.. తెరవెనుక చకచకా కదులుతున్న పావులు!**

- కాంగ్రెస్, ఎన్సీపీ (శరద్ పవార్) విలీన చర్చలు
- మహారాష్ట్ర రాష్ట్రస్థాయి నేతల మధ్య అంతర్గత సమాలోచనలు
- ఢిల్లీ వేదికగా తుది నిర్ణయం తీసుకునే అవకాశం
- మహా వికాస్ అఘాడీ కూటమిలో పెరుగుతున్న విభేదాలు
- 1999 నాటి చారిత్రక చీలికకు ముగింపు పలికే దిశగా అడుగులు



మహారాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు దారితీసే ఒక సంచలన పరిణామం తెరపైకి వచ్చింది. సీనియర్ నేత శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ - శరద్ పవార్ శ్రేణి) పార్టీని, కాంగ్రెస్‌లో విలీనం చేసే దిశగా ఇరు పార్టీల మహారాష్ట్ర రాష్ట్రస్థాయి విభాగాల మధ్య అత్యంత - మిగతా 2 లో

## భారత్-పాక్ మధ్య చర్చలు జరపండి

**ఇరు దేశాల ప్రధానులకు 117 మంది ప్రముఖుల లేఖ**

- భారత్-పాకిస్థాన్ మధ్య చర్చలు ప్రారంభించాలని ప్రముఖుల ఉమ్మడి లేఖ
- ఇరు దేశాల ప్రధానులు మోదీ, షెహబాజ్‌కు 117 మంది ప్రముఖుల విజ్ఞప్తి
- ఉగ్రవాదం వంటి అంశాలపైనా చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని సూచన
- శాంతి, స్థిరత్వంతోనే ఆర్థిక శ్రేయస్సు సాధ్యమని వెల్లడి
- ప్రస్తుత ఉద్రిక్తతలు సాధారణ ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతున్నాయని ఆందోళన



భారతదేశం, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించి, ఇరు దేశాల మధ్య చర్చల ప్రక్రియను పునఃప్రారంభించాలని కోరుతూ 117 మంది ప్రముఖులు ముందుకు వచ్చారు. భారత్, పాక్‌లకు చెందిన ఈ ప్రముఖులు ప్రధాని నరేంద్ర మోదీ, - మిగతా 2 లో

## 'తల్లికి వందనం' రెండో విడత తేదీలు ఖరారు



- ★ జులై 16 నుంచి 18 మధ్య తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్న మంత్రి లోకేశ్
- ★ 150 రోజుల్లో 16,000 టీచర్, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశామని వెల్లడి
- ★ ఈ ఏడాది మరో 10,000 పోస్టులతో మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న లోకేశ్
- ★ ప్రభుత్వ విజయాలపై జులై 15 నుంచి ఇంటింటి ప్రచారం చేయాలని పిలుపు

'తల్లికి వందనం' పథకం రెండో విడత నిధులను జులై 16 నుంచి 18వ తేదీల మధ్య - మిగతా 2 లో

## ఆధారాలు లేని ఆరోపణలు సహించం

**సోషల్ మీడియా దుర్వినియోగంపై పవన్ హెచ్చరిక!**



- వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయొద్దని పవన్ హెచ్చరిక
- ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు సహించబోమని స్పష్టం
- సైబర్ వేధింపుల బాధితుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు
- ఆధారాలతో ఫిర్యాదు చేస్తే బీఎన్ఎస్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు

సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక - మిగతా 2 లో

# పవన్ సారథ్యంలో గ్రామాల రూపురేఖలు మారుస్తాం

- ఏపీలోని రైల్వే కోడూరు నుంచి దేశవ్యాప్తంగా వీబీ జీ రామ్ జీ పథకం ప్రారంభం
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో రూ.11,000 కోట్లతో గ్రామీణ అభివృద్ధి
- రాష్ట్రంలో విధ్వంసమైన వ్యవస్థలను రెండేళ్లలోనే గాడిన పెట్టాం: సీఎం చంద్రబాబు
- పోలవరం, అమరావతి నిర్మాణాలు ఆగవు.. స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యం అన్ స్టాపబుల్ అని వ్యాఖ్య
- రాయలసీమను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని హామీ




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చేస్తామని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో సుమారు రూ.11,000 కోట్లకు పైగా నిధులతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం

## ‘తల్లికి వందనం’ రెండో విడత తేదీలు ఖరారు

మొదటిపేజీ తరువాయి - తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లు (పీటీఎం) నిర్వహించే సమయంలోనే ఈ నిధులను విడుదల చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రేణిగుంట మండలంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 150 రోజుల వ్యవధిలోనే 16,000 ఉపాధ్యాయ, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ ఏడాది మరో 10,000 పోస్టులతో మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జులై 15 నుంచి ‘ఇంటింటి ప్రచారం’ చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా, ప్రతిపక్ష పార్టీల వైఖరిని ప్రస్తావిస్తూ.. కార్యకర్తలు చెడు లక్షణాలను అలవర్చుకోవద్దని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా లోకేశ్ పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి తనిఖీ చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించడంతో పాటు, పలువురు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.c

## ఆధారాలు లేని ఆరోపణలు సహించం

మొదటిపేజీ తరువాయి - వ్యాఖ్యలు చేశారు. వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. ఒకరి హక్కులను మరొకరు హరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును స్వాగతిస్తామని, కానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సహించబోమని స్పష్టం చేశారు. మత విశ్వాసాలను దెబ్బతీయడం రాజ్యాంగం కల్పించిన హక్కు కాదని పవన్ అన్నారు. వ్యక్తిగత దూషణలు, చంపేస్తామని బెదిరించడం, దేవుళ్లు, దేవతలపై ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. నిర్మాణాత్మక విమర్శలను ప్రభుత్వం ఎప్పుడూ స్వాగతిస్తుందని చెప్పారు. సైబర్ వేధింపులు, పరువు ప్రతిష్ఠలను దెబ్బతీసే చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని పవన్ పేర్కొన్నారు. నేరస్థులకు కులం, మతం ఉండదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బాధితులు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.c

## సవాల్ చేసి వెనక్కి తగ్గారు

మొదటిపేజీ తరువాయి - అధ్యక్షుడు కేటీఆర్ పునరుద్ఘాటించారు. కానీ సవాల్ చేసిన కాంగ్రెస్ మంత్రులే ఇప్పుడు వెనక్కి తగ్గారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డి మొదట చర్చకు సవాల్ విసిరారని తెలిపారు. తాము అంగీకరించాక మాట మార్చారని విమర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పి చివరకు గన్‌పార్క్‌కు వెళ్లడం ఎందుకని ప్రశ్నించారు. సవాళ్లు విసిరే ముందు వాటిని నిలబెట్టుకునే ధైర్యం ఉండాలని అన్నారు. గన్‌పార్క్‌కు వెళుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. ప్రభుత్వానికి ఏ అంశంపైనా బహిరంగ చర్చ చేపట్టే ధైర్యం లేదని ఆరోపించారు. హరీశ్‌రావు సహా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ముందే అన్ని వాస్తవాలు చెప్పాలని భావించినా ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు. రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. స్పీకర్ ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తి స్థాయిలో చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. మరోవైపు గన్‌పార్క్ వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తన సవాల్ కేటీఆర్, హరీశ్‌రావులకు కాదని తెలిపారు. నేరుగా కేసీఆర్‌కేనని స్పష్టం చేశారు. తాను చెప్పిన అప్పుల లెక్కలు తప్పని నిరూపిస్తే మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని ప్రకటించారు.

## తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్ పోలీసుల అదుపులో హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి - బీఆర్ఎస్ నేత హరీశ్‌రావును తెలంగాణ భవన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేదని ముందుకు వెళ్లనివ్వలేదు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చర్చకు వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. వాహనాన్ని నిలిపివేయడంతో హరీశ్‌రావు కాలినడకన గన్‌పార్క్‌కు వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఈ తొక్కిసలాటలో హరీశ్‌రావు కిందపడిపోయారు. అనంతరం పోలీసులు ఆయన్ను, పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. తమ నేతను అడ్డుకోవడంపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. గురుకులాల్లో అవినీతి, రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు రావాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్.. బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్‌లకు సవాల్ విసిరారు. గన్‌పార్క్ వద్ద తాము సిద్ధంగా ఉంటామని ప్రకటించారు. దీన్ని స్వీకరించిన హరీశ్‌రావు, తామే అక్కడికి వస్తున్నామని చెప్పారు. చర్చ నుంచి పారిపోవద్దని మంత్రులకు సవాల్ విసురుతూ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే అనుమతి లేకపోవడంతో పోలీసులు ఆయన్ను గన్‌పార్క్‌కు వెళ్లనీయకుండా అదుపులోకి తీసుకున్నారు.

## 37 ఏళ్ల తర్వాత కొత్త ఎయిర్ ఫోర్స్ వన్

మొదటిపేజీ తరువాయి - ప్రారంభోత్సవానికి ఆయన ఈ కొత్త విమానంలోనే విచ్చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల విరామం అనంతరం అందుబాటులోకి వచ్చిన కొత్త అధ్యక్ష విమానంలో ఇదే తన తొలి ప్రయాణమని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మెడోరాలో నిర్వహించిన కార్యక్రమంలో మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. “37 ఏళ్ల తర్వాత ఎయిర్ ఫోర్స్ వన్ అనే ఒక ప్రత్యేక విమానంలో ఇది తొలి ప్రయాణం. ఇదొక అద్భుతమైన విమానం” అని ఆయన ప్రశంసించారు. తాను ఎంతగానో ఆరాధించే మాజీ అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ పట్ల గౌరవ సూచకంగా ఈ పర్యటన సాగింది. వైట్‌హౌస్‌లోని రూజ్‌వెల్ట్ రూమ్‌లో భద్రపరిచిన ఆయన ‘కాంగ్రెషనల్ మెడల్ ఆఫ్ హానర్’ను ట్రంప్ స్వయంగా ఈ లైబ్రరీకి అందజేశారు. ఈ సంస్థ ప్రారంభోత్సవంలో పాల్గొన్న తొలి సిట్టింగ్ ప్రెసిడెంట్‌గా ట్రంప్ రికార్డు సృష్టించారు. ఈ కార్యక్రమానికి ఆతిథ్యమిచ్చిన ఇంటీరియర్ సెక్రటరీ డగ్ బర్గమ్ దీనిని ఒక “చారిత్రక ఘట్టం”గా అభివర్ణించారు. లైబ్రరీ ప్రారంభమైన తర్వాత, రూజ్‌వెల్ట్ రాసిన ప్రఖ్యాత “మ్యాన్ ఇన్ ది అరీనా” వ్యాసాన్ని ట్రంప్ చదువుతుండగా రూపొందించిన రికార్డింగ్‌ను సందర్శకులు వినవచ్చు. లైబ్రరీ తొలి ఏడాది ప్రదర్శనల కోసం నేషనల్ ఎండోమెంట్ ఫర్ హ్యూమానిటీస్ ద్వారా 7,50,000 డాలర్ల ఫెడరల్ గ్రాంటును కూడా ట్రంప్ ప్రకటించారు. ప్రస్తుత అధ్యక్ష విమానాలు గత మూడు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నాయి. వాణిజ్య విమానాలను అత్యంత సురక్షితమైన అధ్యక్ష విమానాలుగా మార్చడానికి అనేక సంక్లిష్ట నిబంధనలు ఉండటంతో, ఈ ఆధునికీకరణ పనులు చాలా ఏళ్లుగా కొనసాగుతున్నాయి. అమెరికా 250వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

## తండ్రి అంత్యక్రియలకు మొజ్తబా ఖమేనీ దూరం.. కారణమిదే!



మొదటిపేజీ తరువాయి - పాల్గొనకపోవచ్చని ఇరాన్ సీనియర్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. ఈ పరిణామం ఇరాన్‌తో పాటు అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఆయన అంత్యక్రియలను జులై మొదటి వారం నుంచి భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇరాన్ చరిత్రలోనే అతిపెద్ద కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచిపోయే ఈ అంత్యక్రియలకు లక్షలాది మంది ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, భారత్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి అయతొల్లా హకీం ఇలాహీ కీలక విషయాలను వెల్లడించారు. “మొజ్తబా స్వయంగా ప్రజల వద్దకు రావాలని, వారిని కలవాలని ఆకాంక్షిస్తున్నారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో భద్రతా దళాలు అందుకు అనుమతించడం లేదు. ఆయనకు రక్షణ కల్పించడం అత్యంత ప్రమాదకరమని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ కారణంతోనే ఆయన అంత్యక్రియలకు కూడా హాజరుకాకపోవచ్చు” అని ఇలాహీ తెలిపారు.

## తమిళనాడులో గోవధపై హైకోర్టు నిషేధాన్ని సుప్రీంలో సవాల్ చేసిన విజయ్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి - తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**ప్రభుత్వ వాదనలు ఇవే..**

మే 27న మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు.. ‘తమిళనాడు జంతు సంరక్షణ చట్టం-1958’ నిబంధనలకు విరుద్ధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తోంది. ఈ చట్టం ప్రకారం పదేళ్లు దాటిన, వ్యవసాయ పనులకు లేదా సంతానోత్పత్తికి పనికిరావని పశువైద్య అధికారి ధ్రువీకరించిన ఆవులను వధించేందుకు అనుమతి ఉంది. అయితే, హైకోర్టు తీర్పు ఈ చట్టాన్ని పట్టించుకోకుండా, రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ నిషేధం విధించిందని ప్రభుత్వం తన అప్పీల్‌లో పేర్కొంది. వాస్తవానికి, కోయంబత్తూరులో బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో జంతువధను నిరోధించాలని మాత్రమే కోర్టులో పిటిషన్ దాఖలైందని, కానీ హైకోర్టు తన పరిధిని దాటి రాష్ట్రవ్యాప్త నిషేధానికి ఆదేశాలు జారీ చేసిందని ప్రభుత్వం వివరించింది.

**మత స్వేచ్ఛకు భంగం..**

బక్రీద్ లేదా మరే ఇతర రోజుల్లోనూ ఆవులు, దూడలను వధించకుండా చూడాలని హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు కేవలం బక్రీద్ పండుగకే కాకుండా రాష్ట్రంలోని హిందూ దేవాలయాల్లో జరిగే జంతుబలులపై కూడా ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది. పండుగల సమయంలో పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా లైసెన్స్ ఉన్న స్లాటర్‌హౌస్‌లలో వసతి కల్పించడం అసాధ్యమని, చాలా వాటికి అంత సామర్థ్యం లేదని పలువురు సామాజిక నాయకులు అంటున్నారు. ఎంఎంకే అధ్యక్షుడు ఎం.హెచ్. జవహిరుల్లా ఈ తీర్పును బాధాకరం అని అభివర్ణిస్తూ, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు హామీ ఇచ్చిన మత స్వేచ్ఛను హరించడమేనని అన్నారు.

**ప్రతిపక్షాల విమర్శలు**

ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయడంలో టీవీకే ప్రభుత్వం జాప్యం చేసిందని ప్రతిపక్ష డీఎంకే విమర్శించింది. డీఎంకే ప్రతినిధి డాక్టర్ సయ్యద్ హఫీజుల్లా మాట్లాడుతూ.. “పాలిచ్చే ఆవులను ఆర్థిక కారణాల వల్ల ఎవరూ వధించరు. ఈ తీర్పు కేవలం ఆవులకే కాకుండా ఎద్దులు, గేదెల వధను కూడా నిషేధిస్తోంది. ఇది ముస్లింలకే కాదు, ఆలయాల్లో బలులు ఇచ్చే హిందువుల ఆచారాలపైనా ప్రభావం చూపుతుంది” అని అన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న జాప్యంపై స్పందించిన టీవీకే వర్గాలు.. “న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపేందఖుతుకు కొంత సమయం పట్టింది” అని వివరణ ఇచ్చాయి. ప్రస్తుతం ఉన్న చట్టాలు జంతువధకు సంబంధించి స్పష్టమైన నిబంధనలను నిర్దేశిస్తున్నాయని, హైకోర్టు తీర్పు ‘జ్యుడీషియల్ లెజిస్లేషన్’ (న్యాయవ్యవస్థ చట్టాలను రూపొందించడం) కిందకు వస్తుందని ప్రభుత్వం సుప్రీంకోర్టులో తన వాదనను వినిపించింది.

## మహారాష్ట్ర రాజకీయంలో పెను సంచలనం

మొదటిపేజీ తరువాయి - రహస్యంగా చర్చలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఒకవేళ ఈ విలీనం గనుక సఫలమైతే, మహారాష్ట్ర ప్రతిపక్ష రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతం ఈ విలీన ప్రతిపాదనలపై రాష్ట్రస్థాయిలోనే ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయి. ఎన్సీపీ (ఎస్పీ) తమ పార్టీ అంతర్గతంగా నేతలందరి మధ్య ఒక ఏకాభిప్రాయాన్నిసాధించిన తర్వాత, ఈ అంశాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానం వద్దకు తీసుకెళ్లి తుది నిర్ణయం తీసుకోనున్నారు. నిజానికి, 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ విలీన ఆలోచన వచ్చినప్పటికీ.. ఎన్నికల ప్రచారం, వ్యూహాల బిజీ వల్ల దీనిని తాత్కాలికంగా పక్కన పెట్టారు. ఇప్పుడు ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ ప్రక్రియ మళ్లీ ఊపందుకుంది.

**కూటమిలో కుదుపు.. 27 ఏళ్ల చరిత్రకు ముగింపు?**

ఈ విలీన వార్తలు ‘మహా వికాస్ అఘాడీ’ (ఎంవీఏ - కాంగ్రెస్, ఎన్సీపీ శరద్ పవార్, శివసేన ఉద్ధవ్ థాకరే) కూటమిలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇటీవల ఉద్ధవ్ థాకరే వర్గంలో జరిగిన తిరుగుబాట్లు, అలాగే కూటమి ఐక్యతపై స్వయంగా ఉద్ధవ్ థాకరే బహిరంగంగానే అనుమానాలు వ్యక్తం చేయడంతో ఎంవీఏ భాగస్వామ్య పక్షాల మధ్య ఇప్పటికే తీవ్రమైన భేదాభిప్రాయాలు నడుస్తున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్, ఎన్సీపీ విలీన ప్రయత్నాలు కూటమి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. 1999లో సోనియా గాంధీ విదేశీ మూలాల వివాదం నేపథ్యంలో.. శరద్ పవార్ కాంగ్రెస్ నుండి బయటకు వచ్చి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని స్థాపించారు. సరిగ్గా 27 ఏళ్ల తర్వాత మళ్లీ అదే కాంగ్రెస్ గూటికి శరద్ పవార్ చేరబోతుండటం గమనార్హం. 2023లో ఆయన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ సొంతంగా చీలిక తెచ్చి అధికార పక్షంతో చేతులు కలపడం వల్ల ఎన్సీపీ మరింత బలహీనపడింది. ఇటీవల అజిత్ పవార్ గ్రూపుతో విలీనాన్ని పూర్తిగా తోసిపుచ్చిన శరద్ పవార్.. ఇప్పుడు కాంగ్రెస్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమవ్వడం మహారాష్ట్ర పాలిటిక్స్‌లో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

## భారత్-పాక్ మధ్య చర్చలు జరపండి

మొదటిపేజీ తరువాయి - పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లకు ఉమ్మడిగా ఒక లేఖ రాశారు. దౌత్య మార్గాలను తిరిగి తెరిచి, సంప్రదింపులకు శ్రీకారం చుట్టాలని వారు తమ లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహిస్తున్న ఢిల్లీకి చెందిన ‘సెంటర్ ఫర్ పీస్ అండ్ ప్రోగ్రెస్’ అధినేత ఓపీ షా ఈ విషయంపై మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలు ఏమాత్రం ఆశాజనకంగా లేవని, ఈ పరిస్థితి ఉపఖండంలోని సాధారణ ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య శాంతి, స్థిరత్వం, సాధారణ సంబంధాలు నెలకొంటేనే ప్రజల ఆర్థిక శ్రేయస్సు సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇరు దేశాలను సంఘర్షణ వైపు నడిపించే ఏ చిన్న సంఘటన అయినా ప్రజల జీవనోపాధిని, అభివృద్ధిని దెబ్బతీస్తుందని ఆయన వివరించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రదాడుల (26/11 ముంబై, పుల్వామా, పహల్గామ్) గురించి ప్రశ్నించగా.. చర్చలు, సంప్రదింపులపై తనకు పూర్తి విశ్వాసం ఉందని షా బదులిచ్చారు. ఉగ్రవాదం, భద్రతాపరమైన ఆందోళనలతో సహా అన్ని క్లిష్టమైన సమస్యలను దౌత్యపరమైన చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. చర్చలు నిరంతరాయంగా కొనసాగాలని, ఏ దశలోనూ ఇరు దేశాల మధ్య సంభాషణలు ఆగకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. ‘ఆపరేషన్ సిందూర్’ తర్వాత ఉగ్రవాదంపై భారత్ కఠినంగా వ్యవహరిస్తున్న తీరుపై స్పందిస్తూ.. ఎంతటి కఠినమైన సమస్యలైనా చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని షా పునరుద్ఘాటించారు. భారత్, పాకిస్థాన్‌లలోని లక్షలాది మంది ప్రజలు శాంతినే కోరుకుంటున్నారని, తమ శాంతి పిలుపునకు మద్దతుగా వేలాది మంది సంతకాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. నిరంతర చర్చల వల్ల ఒకరి ఆందోళనలు, పరిమితులు మరొకరు అర్థం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

## జెడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి దాకా

మొదటిపేజీ తరువాయి - చరిత్రపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ జడ్పీటీసీ సభ్యుడిగా ఆయన వేసిన తొలి అడుగు.. నేడు ఆయనను రాష్ట్ర అత్యున్నత పీఠంపై కూర్చోబెట్టింది. ప్రజాప్రతినిధిగా ఆయన ప్రస్థానం ప్రారంభమై ఈనెల జూలై 4 నాటికి సరిగ్గా 20 ఏళ్లు పూర్తి కానున్నాయి. ఈ సందర్భంగా తనకు రాజకీయ జీవితం ఇచ్చిన మిడ్జిల్‌లో జూలై 4వ తేదీన రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. మిడ్జిల్ ప్రజల సమక్షంలోనే ప్రజాప్రతినిధిగా తన జీవితం ప్రారంభించిన రోజును గుర్తుచేసుకోనున్నారు. అప్పట్లో తన గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం కానున్నారు. ప్రజాప్రతినిధి నుంచి సీఎం పీఠం దాకా సాగిన తన కెరీర్ పునాదిగా నిలిచిన మిడ్జిల్ ప్రజలకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. తన రాజకీయ ప్రయాణంలో తనను ప్రజాప్రతినిధిగా తొలిసారి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవాలనే భావనతోనే.. ‘మీ బిడ్డను.. మళ్లీ వస్తున్నా... మీ ఆశీర్వాదం, ఆదరణతోనే రాష్ట్రానికి సేవ చేసే అవకాశం వచ్చింది’ అనే భావంతో మిడ్జిల్ ప్రజల ముందుకు వస్తున్నారు. విద్యార్థి దశలో ఏబీవీపీలో పనిచేసిన రేవంత్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లో రేవంత్ రెడ్డి తొలి అడుగు స్వతంత్రంగానే పడింది. ఉమ్మడి రాష్ట్రంలో 2006 పరిషత్ ఎన్నికల్లో మిడ్జిల్ జెడ్పీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి జూలై 4వ తేదీన విజయం సాధించారు. మరుసటి ఏడాది 2007లో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి శాసనమండలిలో తొలిసారి అడుగుపెట్టారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరిన రేవంత్‌రెడ్డి తన సరికొత్త పంథాతో ఆ పార్టీలో కీలక నాయకుడిగా ఎదిగారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి 2009, 2014లో పోటీ చేసి ఎమ్మెల్యేగా రెండుసార్లు విజయం సాధించారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ శాసనభలో టీడీపీఎల్పీ.. బీఆర్ఎస్ఎల్పీలో విలీనం కావడం.. తెలుగుదేశం మనుగడ ప్రశ్నార్థకం కావడంతో రేవంత్ రెడ్డి ప్లేటు ఫిరాయించి పార్టీ మారారు. వెంటనే టీడీపీకి గుడ్‌బై చెప్పేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తిరుగులేని జనాకర్షక నాయకుడిగా రేవంత్ రెడ్డి గుర్తింపు పొందారు. ప్రజల్లో రేవంత్‌రెడ్డికి వస్తున్న స్పందనను గ్రహించిన అధిష్ఠానం 2018 ఎన్నికలకు ముందు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించింది. అయితే 2018 ఎన్నికల్లో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ కొడంగల్‌పైన ప్రత్యేక దృష్టి సారించడం, ఇతర పరిణామాల నేపథ్యంలో ఆ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఘోరంగా ఓడిపోయారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానని చెప్పి మాటతప్పారు. అనంతరం2019 లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి స్థానంలో పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఎంపీగా విజయం సాధించారు. 2021 జూలై 7వ తేదీన టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి నియమితులయ్యారు. పార్టీ పగ్గాలు అందుకున్న రేవంత్‌రెడ్డి 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయతీరానికి చేర్చారు. 2023 డిసెంబర్ 7వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ముఖ్యమంత్రి పీఠం వరకూ సాగిన రేవంత్‌రెడ్డి ప్రస్థానంలో మిడ్జిల్ జడ్పీటీసీ అభ్యర్థిగా ఆయన సాధించిన తొలి విజయం ప్రత్యేకమనే చెప్పవచ్చు. ఆ ప్రత్యేకతను మరోమారు గుర్తు చేసుకునేందుకు రేవంత్‌రెడ్డి జూలై 4న మిడ్జిల్‌లో పర్యటించనున్నారు.

**రేపు మిడ్జిల్ పర్యటన**

మిడ్జిల్ పర్యటనకు రానున్న రేవంత్ రెడ్డి మొదట ఊరుకొండ ఆలయాన్ని సందర్శించనున్నారు. తన తొలి రాజకీయ ప్రయాణంలో వెంట నడిచిన అనుచరులు, ఆత్మీయులు, ముఖ్య నాయకులు, ఆనాటి పెద్దలతో కలిసి ‘ఆత్మీయ విందు’ చేస్తారు. మిడ్జిల్ సమీపంలో ఏర్పాటు చేసిన సభలో రేవంత్? రెడ్డి కీలక ప్రసంగం చేస్తారు. ఈ సందర్భంగా మిడ్జిల్ మండలంపై వరాల జల్లు కురిపించే అవకాశం ఉంది. ఇప్పటికే మిడ్జిల్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేసిన విషయం తెలిసిందే.

## పవన్ సారథ్యంలో గ్రామాల రూపురేఖలు మారుస్తాం



మొదటిపేజీ తరువాయి - చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో 125 రోజుల పనిదినాలు కల్పించి, రహదారులు, డ్రైనేజీలు, కాలువలు వంటి శాశ్వత ఆస్తుల కల్పనకు శ్రీకారం చుడతామని ఆయన ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకమైన ‘వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ ఆజీవికా మిషన్’ (వీబీ జీ రామ్ జీ) ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావడం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ముక్కవారిపల్లి గ్రామంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. “గతంలో ఉపాధి హామీ పథకం (నరేగా) కూడా రాయలసీమ నుంచే ప్రారంభమైంది. ఇప్పుడు మళ్ళీ వీబీ జీ రామ్ జీ పథకం ఇక్కడి నుంచే దేశవ్యాప్తంగా ప్రారంభం కావడం మనందరికీ గర్వకారణం. కేంద్రం రూ.7,700 కోట్లు, రాష్ట్రం రూ.4,000 కోట్లు కలిపి మొత్తం రూ.11,000 కోట్లకు పైగా నిధులతో గ్రామీణ అభివృద్ధికి బాటలు వేస్తాం. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఏ పనైనా చేపట్టవచ్చు. ముఖ్యంగా పొలాలకు వెళ్లే డొంక రోడ్లను కూడా నిర్మించుకోవచ్చు. జియో ట్యాగింగ్, బయోమెట్రిక్ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి పారదర్శకంగా ఈ పథకాన్ని అమలు చేస్తాం” అని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పూర్తిగా విధ్వంసమైందని, జల్ జీవన్ మిషన్ సహా 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను నిర్వీర్యం చేశారని చంద్రబాబు ఆరోపించారు. “విధ్వంసమైన రాష్ట్రాన్ని నిలబెడతామని చెప్పి, కేవలం రెండేళ్లలోనే మాట నిలబెట్టుకున్నాం. ఇప్పుడు రూ.28 వేల కోట్లతో వివిధ పథకాలు చేపడుతున్నాం. గొడ్డలి పార్టీ రోజుకో మాట మాట్లాడుతోంది. ఎన్నికలకు ముందు ఒకటి, తర్వాత మరొకటి. ఇప్పుడు ‘మావిగన్’ అంటూ కొత్త పాట పాడుతున్నారు. ఇది ఎవరికైనా అర్థమైందా? అమరావతిని ఆపడం ఎవరి తరమూ కాదు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం” అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాయలసీమ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుపుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. “రాయలసీమ దేశంలోనే ఉద్యాన పంటలకు కేంద్రం. త్వరలో రూ.40 వేల కోట్ల ప్రభుత్వ, రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు తెస్తాం. మదనపల్లిలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే సత్యవేడులో హీరో మోటార్స్ ఉండగా, త్వరలో తిరుపతిలో బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ ప్లాంట్ రాబోతోంది. పుట్టపర్తిలో ఆమ్కా ఫైటర్ జెట్ తయారీ యూనిట్, గూగుల్ డేటా సెంటర్ వస్తున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టడంతో పాటు రైల్వే జోన్ సాధించాం” అని తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అడిగిన వెంటనే తోతాపురి మామిడి రైతుల సమస్యలు, రహదారులు, పీఎంఏవై గృహాల కోసం నిధులు కేటాయించారని, ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. “భారత మాతకు వికసిత్ భారత్, తెలుగు తల్లికి స్వర్ణాంధ్ర మా సంకల్పం. బంగారం గనులున్న జొన్నగిరి పేరును చారిత్రక స్వర్ణ గిరిగా మార్చాం. స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధన అన్ స్టాపబుల్” అని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేశ్ పాశ్వాన్, పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## " ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వ భావాలను పెంపొందిస్తాయి తెలంగాణ రాష్ట్ర పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్





**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 2:** " దేవాలయాలు సమాజంలో ఐక్యత, భక్తి భావం సాంస్కృతిక విలువలను పెంపొందించే ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయి ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్." బోరబండలో శివాజి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కినాపురం లక్ష్మణ్ గౌడ్ ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ నూతన దేవాలయ యంత్ర విగ్రహ సింహ వాహన శిఖర ప్రతిష్ట మహోత్సవానికి ముఖ్య అతిధులుగా హాజరై స్థానిక నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన తెలంగాణ రాష్ట్ర పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ సభ్యులు,టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.. దర్శనానంతరం ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, వేద పండితులు వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మహేష్ కుమార్ గౌడ్ ని డా. సత్యం శ్రీరంగం ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గురువారం నల్లపోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజానికి శాంతి, సత్సంకల్పాలు కలిగిస్తాయని, ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి దీవెనలు, కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సమృద్ధి వర్షాలతో పాడిపంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగింది. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. హైదరాబాద్ లో నెల రోజుల పాటు జరిగే ఆషాఢ బోనాల ఉత్సవాలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. భక్తిశ్రద్ధలతో ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించి, వారి సేవా భావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ ల అధ్యక్షులు మొయినుద్దీన్, కృష్ణ రాజ్ పుత్, విఠల్ రెడ్డి, నరసింహా యాదవ్, కనకయ్య, లక్ష్మీనారాయణ, సుంకన్న, మస్తాన్ రెడ్డి, భారతమ్మ, కలికోట శంకర్, రాజేష్ గౌడ్, పల్లపు వేణు, చోట మొయిజ్, అహ్మద్ వాజీద్ పాషా, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయాన్ని కాపాడాలని భారీ నిరసన కార్యక్రమం

### విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, మేధావుల ఐక్య గళం



**నిజం న్యూస్ హైదరాబాద్, జూలై 2:** నాంపల్లి ప్రాంగణంలోని తెలుగు విశ్వవిద్యాలయాన్ని యథాతథంగా కొనసాగించాలని కోరుతూ గురువారం రోజు విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, సాహితీ--సాంస్కృతిక వర్గాలకు చెందిన ప్రముఖులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు తదితరులు పాల్గొని ప్రభుత్వం ఇప్పటికే ఆద్యకళకు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించిన మళ్లీ తిరుమలరావు,కోదండరాం ఎ ముఖం పెట్టుకోని తెలుగు విశ్వవిద్యాలయంలో కాలు మోపారని ప్రశ్నించారు. తెలుగు విశ్వవిద్యాలయ స్థలాన్ని తగ్గించే ప్రయత్నం చేయడం సమంజసం కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ఈ విశ్వవిద్యాలయాన్ని బలహీనపరిచే చర్యలను వెంటనే విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలోనే కొనసాగాలని, ఇప్పటికే ఆద్యకళ ఆధీనంలో ఉన్న పాత వస్తువులు, సామగ్రిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన తగిన మ్యూజియంకు తరలించాలని సూచించారు. ఆద్యకళ వారసత్వంపై నిజమైన అభిమానం ఉంటే, ఆ వస్తువులను ప్రజలకు అందుబాటులో ఉండే ప్రత్యేక మ్యూజియంలో భద్రపరచడం ఉత్తమ మార్గమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో జ్యోతిష్యం, యోగా, బి.డిజైన్, పద్యనాటకం, దూరవిద్యతో పాటు పలు కోర్సుల్లో 2,500 మందికి పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, ప్రస్తుతం ఉన్న తరగతి గదులే సరిపోని పరిస్థితి ఉందని వక్తలు పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో మరిన్ని గదులను ఇతర అవసరాలకు కేటాయించడం వల్ల విద్యార్థుల విద్యా కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆద్యకళ ఆధీనంలో ఉన్న గదులను తిరిగి విశ్వవిద్యాలయానికి అప్పగించి, విద్యార్థుల అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిరసనలో పాల్గొన్నవారు "తెలుగు విశ్వవిద్యాలయాన్ని కాపాడాలి" "నాంపల్లి ప్రాంగణాన్ని యథాతథంగా కొనసాగించాలి" "విద్యార్థుల హక్కులను పరిరక్షించాలి" అంటూ నినాదాలు చేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఆటంకం కలిగించే నిర్ణయాలను పునఃసమీక్షించి, విద్యార్థుల భవిష్యత్తు, తెలుగు భాషా--సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోకపేట్ యాదవ విద్యార్థుల వసతి గృహ భవనంను ప్రారంభోత్సవం చేయటానికి ముందుకు రావాలి.. బేరి రామచంద్ర యాదవ్ డిమాండ్

**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూలై 2:** కోకాపేటలో యాదవ విద్యార్థుల వసతి కోసం నిర్మించిన భవనాన్ని ప్రారంభించేందుకు తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ శేర్లింగంపల్లి లోని బీసీ కార్యాలయంలో బేరి రామచంద్ర యాదవ్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోకపేట్ లో యాదవ విద్యార్థుల వసతి గృహం కోసం ఐదు ఎకరాల భూమిని కేటాయించి అప్పటి మంత్రి అయిదు కోట్లతో నిర్మాణాన్ని పూర్తి చేశారని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత భవనం ప్రారంభించడానికి ఏ ఒక్కరు చొరవ చూపడం లేదన్నారు. 2018 లో అప్పటి ప్రభుత్వం బీసీ కులాలతో పాటు మిగతా కుల సంఘాలకు అందరికీ ఉప్పల్ భగాయత్ కోకాపేటలో కుల సంఘాల భవనాల గురించి భూములు కేటాయించడం జరిగిందన్నారు. కమ్మ కులానికి 10 ఎకరాలు వెలమ కులానికి 5 ఎకరాలు మిగతా వెనుకబడిన ముదిరాజులకు ఐదు ఎకరాలు యాదవ కులానికి 5 ఎకరాలు ఈ విధంగా అన్ని కులాలకు భూములు కేటాయించడం జరిగింది. అయితే యాదవ విద్యార్థుల వసతిగృహం విషయంలో ప్రభుత్వం నాన్చుడు ధోరణి వ్యవహరిస్తోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చొరవ చూపి, యాదవ సంఘాల నాయకులు సంఘటితమై భవన ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా కుల సంఘాల భవనాలు నిర్మాణం జరిగితే 33 జిల్లాల నుండి విద్యార్థులు ఉండటానికి వసతికి ఇంతగానో ఉపయోగపడుతుంది అన్న విషయాన్ని గుర్తు చేశారు. అందుకని యాదవ్ పెద్దలు రేవంత్ రెడ్డి ని ఆహ్వానించి ప్రస్తుతం ఉన్న భవనాన్ని ప్రారంభోత్సవం చేసుకొని హాస్టల్ గురించి ఇతరత్రా నిర్మాణాల గురించి నిధులు కోరాలని యాదవ్ పెద్దలకు బేరి రామచంద్ర యాదవ్ సూచించడం జరిగింది.



## ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తాం



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూలై 2:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు చేపడుతున్న వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి లో జరుగుతున్న 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను జవీజ ఇంజనీరింగ్ ,టౌన్ ప్లానింగ్. ఎలక్ట్రికల్ విభాగం అధికారులు తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి పరిశీలించిన,రాూజ చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా,రాూజ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వెళ్లే రోడ్డు వయా ఎల్లమ్మబండ రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని ,ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగినది అని ,దానిలో భాగంగా తీసుకోవాల్సిన చర్యల పై గతంలో అధికారులతో కలిసి ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర గా స్వయంగా నడుచుకుంటూ వెళ్లడం జరిగిన సంగతి విదితమే అని,రాూజ చైర్మన్ గాంధీ తెలియచేసారు. 100 ఫీట్ రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యల పై చర్చించి, ప్రణాళిక ను రూపొందించి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, రోడ్డు మధ్యలో వచ్చిన బండ రాళ్ళ ను తొలగించడం జరుగుతుంది అని,రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం జరిగినది అని ,రాూజ చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తి వరకు ఎల్లమ్మ బండ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన గల విద్యుత్ స్థంబాలను స్థాన భ్రంశం చేపట్టడం జరిగినది అని అన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత ,సుఖవంతమైన ,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని, ప్రజలకు రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది అని,రాూజ చైర్మన్ గాంధీ చెప్పడం జరిగినది. 100 ఫీట్ రోడ్డు విస్తరణ పై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగినది అని,ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని,రాూజ చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ ఉద్యమకారులు, సినీ నిర్మాత గొట్టిముక్కల పద్మారావు కు నివాళి..... ఎర్ర యాకన్న.



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 2:** తెలంగాణ ఉద్యమకారులు, సినీ నిర్మాత గొట్టిముక్కల పద్మారావు దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై, నివాళు లు అర్పించిన కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న. గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ వివేకానంద నగర్ ప్రాంతంలోని ఆయన స్వగృహంలో తెలంగాణ ఉద్యమకారులు, సినీ నిర్మాత, దివంగత గొట్టిముక్కల పద్మారావు చిత్రపటానికి కూకట్పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ సభ్యులు అనిల్ కుమార్, శివ కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 2:** గురువారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో ఎస్.ఐ.ఆర్ పై కూకట్పల్లి శేర్లింగంపల్లి నియోజకవర్గం సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఇందులో ప్రధానంగా ఆయన మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ జరుగుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని ..ఈ విషయంలో బి .ఆర్. ఎస్ పార్టీ తరపున దీూా అందరూ కూడా దీనిపై ప్రత్యేక దృష్టి సారించి చూసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అధికారులు కూడా దీనిపై పూర్తి అవగాహన లేని కారణంగా ప్రజలు అయోమయ స్థితిలో ఉన్నారని ..దీనిపై పూర్తి సమాచారం ప్రజలకు చేరవేయగా మనం కూడా అందుబాటులో ఉండి అనుమానాలు నివృత్తి చేయాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు.. ముఖ్యంగా ఓటు ఉండి ఎవరైనా అందుబాటులో లేనియెడల తిరిగి మళ్లీ వారికి బి.ఎల్.ఓ లను అందుబాటులోకి తీసుకెళ్లి తమ ఓటు హక్కు పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు ..ఈ కార్యక్రమంలో కూకట్పల్లి, శేర్లింగంపల్లి నియోజకవర్గం బి.ఎల్.ఎ లు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు...

## ముఖ్యమంత్రి సహాయ నిధి ( CMRF) చెక్కులను పంపిణీ చేసిన డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్



**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూలై 2:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్యం రీత్యా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వెంకట్రావు, లావణ్య, మోహన్, శంకర్ నాయుడు, స్వరూప తదితరులు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తులను పరిశీలించిన అనంతరం మొత్తం రూ.3.50 లక్షల విలువైన సహాయ నిధి చెక్కులు మంజూరయ్యాయి, ఈ చెక్కులను కూన శ్రీనివాస్ గౌడ్ షాపూర్ నగర్ లోని నివాసంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు శ్రీధర్ బాబు సారాధ్యంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు,బాధితులు తమకు ఆర్థిక చేయూత అందించిన ప్రభుత్వానికి మరియు డీసీసీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ కి ధన్యవాదాలు తెలియజేశారు... ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి, సిహెచ్ బుచ్చిరెడ్డి, మోతే శ్రీనివాస్ యాదవ్, షాకీర్, రఘు గౌడ్, వెంకట్ రెడ్డి, శంకర్ గౌడ్, చోటు బాయ్, లక్ష్మణ్, కనకరాజు, రాకేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

## మహిళపై అత్యాచారం కేసులో కాంగ్రెస్ నాయకుడు అరెస్ట్



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి జూలై 2:** అత్యాచారం చేసి వీడియోలు తీసి, బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసిన కాంగ్రెస్ నాయకుడు శేరిలింగంపల్లి నియోజకవర్గం గంగారం ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, అరికెపూడి గాంధీ అనుచరుడు కంది జ్ఞానేశ్వర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు చందానగర్ ప్రాంతంలో 2019లో భర్తను కోల్పోయిన వింతంతువుతో పరిచయం పెంచుకుని, శీతలపానియంలో మత్తు మందు కలిపి అత్యాచారానికి పాల్పడి, వీడియోలు చిత్రీకరించిన జ్ఞానేశ్వర్ ఎవరికైనా చెప్తే వీడియోలు బయట పెడతానని బెదిరించి బాధితురాలి నుండి రూ.50 లక్షలు వసూలు చేసిన నిందితుడు మరోసారి డబ్బులు అడగడంతో ధైర్యం చేసి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించిన పోలీసులు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు కాబట్టి మూడు రోజులుగా వ్యవహారం బయటికి రాకుండా పోలీసులు జాగ్రత్త పడ్డారని ఆరోపణలు

## ఎస్ఐఆర్ ఓటర్ల వెరిఫికేషన్‌పై ఇంటింటి అవగాహన కార్యక్రమం



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 2:** గురువారం భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (ాా×=) ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా, కుకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీ 114వ డివిజన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్ ప్రాంతంలో బీఎల్‌ఓలతో కలిసి కాంగ్రెస్ పార్టీ తరఫున బీఎల్‌ఏలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కాలనీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి, బీఎల్‌ఏలు త్రినాథ్, కాజా నవీన్, గంగాధర్, వాసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా (అర్బన్) బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా సీతారామరాజు నియామకం



**నిజం న్యూస్ రంగారెడ్డి, జూలై 2:** రంగారెడ్డి జిల్లా (అర్బన్) భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా సీతారామరాజు నియమితులైన సందర్భంగా గురువారం రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు సీతారామరాజు ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఓబీసీ వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఓబీసీ వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత ప్రాధాన్యత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, పార్టీ బాధ్యతలను స్వీకరించిన సీతారామరాజు ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరయ్య చారి, గోపాల్ రావు, అక్కినపల్లి సాయి, నర్సింగ్, శివా చారి తదితరులు పాల్గొన్నారు.

## భరత్ నగర్ కాలనీలో ట్రాఫిక్ సమస్య, మౌలిక వసతుల సదుపాయంపై గాంధీ భవన్లో మంత్రి జూపల్లి కృష్ణారావుని కలిసిన కాలనీవాసులు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 2:** కూకట్ పల్లి నియోజకవర్గం భరత్ నగర్ కాలనీ లో ఉన్న సమస్యలు కాలానికి రావడానికి దారి కూడా లేకుండా గత ప్రభుత్వము లో అడ్డంగా నిర్మించిన వాణిజ్య సముదాయములతో కాలని వాసులు ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని .ప్రపంచములో ఎక్కడ లెని ఫ్రీ టర్న్ వద్ద నో యూ టర్న్ అనే బోర్డ్ పెట్టిన సంగతి పేరు ఉన్న ప్రతి ప్రతి న్యూస్ పేపర్ లో ప్రచురితము అయిన సందర్భంగా ఇప్పటి వరకు ట్రాఫిక్ పోలీసులు గానీ అప్పటి +ఎవీజ ఇప్పటి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొని వెళ్ళి నా నో యూ టర్న్ బోర్డు తీయని చందంగా ఉందని గురువారం గాంధి భవన్ లో తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు కి వినతి పత్రము అందచేసిన కాలని సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి నాగిరెడ్డి కమిటీ సభ్యులు వెంకటేష్ యాదవ్, నాగేశ్వర్ రావు బాబు,నరేష్ కుమార్, మధుకర్, వెంకటేష్, బిక్షపతి గౌడ్ లు పాల్గొన్నారు

## కూకట్పల్లి నియోజకవర్గ మూసాపేట్ డివిజన్లో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 2:** ఏఐసీసీ, టిపిసిసి న్యాయకత్వం తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్,టి పి సి సి ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆదేశాల మేరకు, భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ాా×= ఓటరు సమగ్ర విచారణ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, కూకట్‌పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో బూత్ నెం. 177 దీూా ఊర్మిళ, దీూా పి. సాయిరాం తో కలిసి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సప్పిడి భాస్కర్, మూసాపేట్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం. జోజమ్మ, కాంగ్రెస్ నాయకులు టీంకు, జయమ్మ, పుష్పా తదితరులు పాల్గొన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఎన్యూమరేషన్ ఫారాన్ని పరిశీలించి, అవసరమైన సవరణలు చేసి సంబంధిత దీూాకు అందజేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు

## పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి ఎంత పెరగనున్నాయో తెలుసా..? నిపుణులు చెప్పేది ఇదే..!




ఒకేసారి ధరలను ఇంత భారీగా పెంచడం రాజకీయంగా, ఆర్థికంగా అసాధ్యం. అయితే, ధరలను క్రమంగా పెంచడం అసాధ్యం కాదు. ఇరాన్ యుద్ధం తర్వాత గత 74 రోజులుగా ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధర పెరిగినప్పటికీ.. ఈసారి కేవలం స్వల్ప ధరల పెరుగుదలే కాదు. ప్రతి ఇంట్లోనూ ద్రవ్యోల్బణం భయం నెలకొంది. వంటగదిలో ఇప్పటికే ఒత్తిడి పెరిగింది. పెట్రోల్-డీజిల్ ధరల పెరుగుదలతో కూరగాయలు, వంట నూనె, పాలు, బ్రెడ్ వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. ఈరోజు పెట్రోల్-డీజిల్ ధర లీటరుకు సుమారు మూడు రూపాయలు మళ్లీ పెరిగింది. రెండు వారాల్లో ధర ఏడున్నర రూపాయలు పెరిగింది. అయితే ఇంధన ధరల పెంపు పోటీ ఇక్కడితో ముగియదని నిపుణులు అంటున్నారు. ధరలు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు సోమవారం పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు వరుసగా రూ.2.61, రూ.2.71 మేర పెంచారు. అయినప్పటికీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలు తాము ఇప్పటికీ భారీ నష్టాలను చవిచూస్తున్నామని తెలిపాయి. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పటికీ, ప్రపంచ మార్కెట్ నుంచి అధిక ధరలకు ముడి చమురు కొనుగోలు చేయడం వల్ల ఇప్పటివరకు తాము చవిచూసిన నష్టాల నుండి కోలుకోవడానికి మరింత సమయం పడుతుంది.

### ధర ఎంత పెరుగుతుంది?

గతంలో జరిగిన భారీ ఆర్థిక నష్టాలను, అలాగే ప్రస్తుతం ఇంధనం కొనుగోలు ధర, అమ్మకపు ధర మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూడ్చుడానికి భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ. 28 నుంచి రూ. 33 వరకు పెంచాలి. నేటి ధరల పెంపు తర్వాత కూడా గత కొన్ని నెలల నష్టాలను పూడ్చుడానికి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను లీటరుకు కనీసం రూ. 20 పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. దీంతో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకేసారి ధరలను ఇంత భారీగా పెంచడం రాజకీయంగా, ఆర్థికంగా అసాధ్యం. అయితే, ధరలను క్రమంగా పెంచడం అసాధ్యం కాదు. ఇరాన్ యుద్ధం తర్వాత గత 74 రోజులుగా ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధర పెరిగినప్పటికీ, చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచలేదు. మే 15న తొలి ఇంధన ధరల పెంపును ప్రకటించేనాటికే, చమురు మార్కెటింగ్ కంపెనీలు 1.2 లక్షల కోట్ల టాకాల నష్టాన్ని చవిచూశాయి.

## 27 కిలోమీటర్ల మైలేజ్ 6 ఎయిర్‌బ్యాగులు.. దేశంలోనే అత్యంత చౌకైన 7-సీటర్ కారు ఇదే..!



ఈ కారు తక్కువ నిర్వహణ ఖర్చులే దీనికి అతిపెద్ద ఆకర్షణ. ప్రతిరోజూ సుదూర ప్రయాణాలు చేసే కుటుంబాలకు, అలాగే పర్యాటకులకు, పాఠశాల వాహనాలకు, చిన్న వ్యాపార అవసరాలకు ఈకో ఒక మంచి ఎంపిక అని అంటారు. ఈ వాహనంలో స్లైడింగ్.. భారత మార్కెట్లో అందుబాటు ధరలలో లభించే 7-సీటర్ కార్లకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో మారుతి సుజుకి ఈకో మరోసారి వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. తక్కువ ధర, మంచి మైలేజ్, తక్కువ నిర్వహణ ఖర్చు, పెద్ద కుటుంబాలకు సరిపోయే డిజైన్‌తో ఈకో ఇప్పుడు మధ్యతరగతి కుటుంబాలకు ఒక ప్రముఖ ఎంపికగా మారింది. మారుతి ఈకో భారతదేశంలోని అత్యంత చౌకైన 7-సీటర్ జచీ+ కార్లలో ఒకటి. ఈ వాహనం 1.2-లీటర్ ఖ-సిరీస్ పెట్రోల్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది పెట్రోల్, జచీ+ రెండు ఆప్షన్‌లలోనూ అందుబాటులో ఉంది. జచీ+ వేరియంట్‌లో 26.78 కి.మీ/కేజీ మైలేజీని ఇస్తుందని కంపెనీ పేర్కొంది.వాహన నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ కారు తక్కువ నిర్వహణ ఖర్చులే దీనికి అతిపెద్ద ఆకర్షణ. ప్రతిరోజూ సుదూర ప్రయాణాలు చేసే కుటుంబాలకు, అలాగే పర్యాటకులకు, పాఠశాల వాహనాలకు, చిన్న వ్యాపార అవసరాలకు ఈకో ఒక మంచి ఎంపిక అని అంటారు. ఈ వాహనంలో స్లైడింగ్ డోర్లు, ఏసీ, విశాలమైన క్యాబిన్, మడతపెట్టగల సీట్లు, మంచి లగేజీ స్థలం ఉన్నాయి. సరికొత్త మోడళ్లలో ఎయిర్‌బ్యాగులు, ఏబీఎస్, వెనుక పార్కింగ్ సెన్సార్ల వంటి భద్రతా ఫీచర్లు కూడా ఉన్నాయి. వంట గ్యాస్‌ను ఆదా చేసే రహస్యం మీకు తెలుసా? ఇలా చేస్తే 30 రోజులకు సరిపోయే సిలిండర్‌ను 45 రోజుల పాటు వాడుకోండి..! భారతదేశంలో 7-సీటర్ కార్ల ధర సాధారణంగా రూ.8 లక్షలకు పైగా ఉన్నప్పటికీ, ఈకో తక్కువ ధరకే లభించడం దాని ప్రజాదరణకు ఒక ప్రధాన కారణం. మారుతి సుజుకి విస్తృతమైన సర్వీస్ నెట్‌వర్క్, తక్కువ విడిభాగాల ధర కూడా వినియోగదారులకు పెద్ద సానుకూల అంశాలు. మారుతి ఈకో ప్రారంభ ధర కేవలం రూ.5.21 లక్షలు. అదేవిధంగా దీని CNG మోడల్ ధర కేవలం రూ.6.36 లక్షలు (ఎక్స్-షోరూమ్). అయితే ఈ కారులో ప్రీమియం ఫీచర్లు లేవనే విమర్శ కూడా ఉంది. ఇందులో టచ్‌స్క్రీన్, పవర్ విండోస్, ఆటోమేటిక్ గేర్‌బాక్స్ వంటి ఆధునిక సౌకర్యాలు లేవు. అయినప్పటికీ, తక్కువ ధరలో ఎక్కువ ప్రయోజనాలు అందించే కారు కావాలనుకునే వారికి మారుతి ఈకో ఒక బలమైన ఎంపిక అని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

## రైలులో ప్రయాణించే ముందు ఈ పొరపాటు అస్సలు చేయకండి లేకపోతే మీరు జైలుపాలే..!




ప్రజలు రైలులో ప్రయాణించడానికి ఇష్టపడినప్పటికీ, చాలా మంది రైలు ప్రయాణాలలో పొరపాట్లు చేస్తారు. దానికి వారు భారీ జరిమానా చెల్లించాల్సి వస్తుంది. రైళ్లలో వస్తువులను తీసుకువెళ్లడానికి సంబంధించి అనేక నియమాలు ఉన్నాయి. వాటి గురించి చాలా మందికి తెలియదు. ప్రయాణికులు తీసుకువెళ్లే.. చాలా మంది సుదూర ప్రయాణాలకు రైలులో ప్రయాణించడానికి ఇష్టపడతారు. విమానాలతో పోలిస్తే రైలు టిక్కెట్లు అంత ఖరీదైనవి కావు. పైగా బస్సుతో పోలిస్తే రైలు ప్రయాణం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. కిటికీలోంచి బయట దృశ్యాలను చూస్తుంటేనే కాలం ఇట్టే గడిచిపోతుంది. ప్రజలు రైలులో ప్రయాణించడానికి ఇష్టపడినప్పటికీ, చాలా మంది రైలు ప్రయాణాలలో పొరపాట్లు చేస్తారు. దానికి వారు భారీ జరిమానా చెల్లించాల్సి వస్తుంది. రైళ్లలో వస్తువులను తీసుకువెళ్లడానికి సంబంధించి అనేక నియమాలు ఉన్నాయి. వాటి గురించి చాలా మందికి తెలియదు. ప్రయాణికులు తీసుకువెళ్లే వస్తువులు లేదా సామానుకు సంబంధించి భారతీయ రైల్వేలో అనేక నియమాలు ఉన్నాయి. వీటిని ఉల్లంఘిస్తే తీవ్రమైన శిక్ష లేదా జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది.

### రైలులో ఏ వస్తువులను తీసుకెళ్లలేము?

రైలులో తీసుకువెళ్లడానికి నిషేధించిన మొదటి వస్తువులు పెట్రోల్-డీజిల్, కిరోసిన్, గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లు, బాణసంచా లేదా ఏ విధమైన మండే పదార్థాలు. చాలా మంది రైలులో క్యాంపింగ్ సిలిండర్లు లేదా ఇంధన డబ్బాలను తీసుకువెళ్తారు. కానీ ఇవి పూర్తిగా నిషిద్ధం. పారిశ్రామిక రసాయనాలు, శుభ్రపరిచే ఆమ్లాలు, పురుగుమందులు కూడా రైలులో అనుమతించరు. ఈ వస్తువులలో దేనినైనా తీసుకువెళుతూ ప్రయాణికుడు పట్టుబడితే, అతను జైలుకు కూడా వెళ్ళవచ్చు. చెల్లుబాటు అయ్యే పత్రం లేకుండా తుపాకులు లేదా కత్తులు వంటి ఆయుధాలను రైళ్లలో తీసుకువెళ్లడం కుదరదు. మీకు లైసెన్స్ ఉన్నప్పటికీ అటువంటి ఆయుధాలను తీసుకువెళ్లడానికి సంబంధించి కఠినమైన నియమాలు ఉన్నాయి. అంతేకాకుండా రైళ్లలో మత్తుపదార్థాలు, వన్యప్రాణులు, అక్రమంగా రవాణా చేసే వస్తువులను తీసుకువెళ్లడం నిషిద్ధం. ఈ సందర్భాలలో పట్టుబడితే మీకు జరిమానా విధించవచ్చు. అలాగే జైలు శిక్ష కూడా విధించవచ్చు. ప్రయాణికులు తరచుగా పెద్ద సంచులు లేదా గోనె సంచులతో రైళ్లు ఎక్కుతారు. రైల్వే నిబంధనల ప్రకారం, రాకపోకలకు అడ్డంకి కలిగించేంత పరిమాణంలో ఉన్న ఏ వస్తువునూ రైలులో తీసుకువెళ్లకూడదు.

# తెలంగాణ వ్యాప్తంగా 37 లక్షల గృహ ఎల్‌పీజీ సిలిండర్లు..!



పెరిగిన డిమాండ్‌ను సమర్థవంతంగా అధిగమించడానికి ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు నిరంతరం నిల్వల స్థితిగతులను సమీక్షిస్తున్నాయి. దీనితో పాటు రవాణా, పంపిణీ ప్రణాళికలను అవి నిశితంగా సమన్వయం చేసుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ తగినంత అందుబాటులో ఉన్నాయని.. తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్న ప్రస్తుత సమయంలో ఇంధన డిమాండ్ పెరిగినప్పటికీ నిరంతర సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వ రంగ చమురు సంస్థలు..రాష్ట్రవ్యాప్తంగా అంతరాయం లేకుండా పెట్రోల్ (ఎంఎస్), డీజిల్ (హెచ్ఎస్‌డీ), ఎల్‌పీజీ అందుబాటులో ఉండేలా చూసేందుకు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లు.. తమ కార్యకలాపాలు, రవాణా ఏర్పాట్లను రాత్రింబవళ్లు సమన్వయం చేసుకుంటున్నాయని పెట్రోలియం- సహజ వాయువుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వివిధ రంగాల్లో ఇంధన డిమాండ్ ఒక్కసారిగా పెరిగినప్పటికీ సరఫరా వ్యవస్థ ఎటువంటి అంతరాయం లేకుండా సాఫీగా సాగుతోందని తెలిపింది. ముఖ్యంగా 2026 మే నెలలో తెలంగాణలో పంట కోత, వ్యవసాయ పనులు ఊపందుకోవటంతో పాటు భారీ ఎత్తున ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోంది. దీనివల్ల ఇటీవల కాలంలో చమురు ఉత్పత్తులకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. ధరలు తక్కువ ఉండటంతో ప్రైవేట్ బంకుల వినియోగదారులు సైతం ప్రభుత్వ రంగ పెట్రోల్ బంకుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ రంగ విక్రయ కేంద్రాల్లో ధరల ప్రయోజనం ఉండటంతో సంస్థాగత, వాణిజ్య వినియోగదారులు సైతం వీటి నుంచే ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే 2026 మే నెలలో తెలంగాణలో ఇంధన విక్రయాలు బలమైన వృద్ధిని నమోదు చేశాయి. సాధారణ వృద్ధి రేటు కంటే చాలా ఎక్కువగా.. డీజిల్ (రిటైల్) విక్రయాలు 12.6 శాతం, పెట్రోల్ (రిటైల్) విక్రయాలు 9 శాతం పెరిగాయి. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ప్రభుత్వ రంగ (పీఎస్‌యూ) పెట్రోల్ బంకుల్లో జరిగిన డీజిల్ అమ్మకాలు 25 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయగా.. 12 జిల్లాల్లో 15 నుంచి 25 శాతం మధ్య వృద్ధి నమోదైంది. మే నెలలో చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీ) తెలంగాణవ్యాప్తంగా 37 లక్షలకు పైగా గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్లను సరఫరా చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి.

### చమురు నిల్వలపై సమీక్ష:

పెరిగిన డిమాండ్‌ను సమర్థవంతంగా అధిగమించడానికి ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు నిరంతరం నిల్వల స్థితిగతులను సమీక్షిస్తున్నాయి. దీనితో పాటు రవాణా, పంపిణీ ప్రణాళికలను అవి నిశితంగా సమన్వయం చేసుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ తగినంత అందుబాటులో ఉన్నాయని వినియోగదారులకు భరోసా ఇస్తున్న చమురు పరిశ్రమ.. కేంద్ర పెట్రోలియం శాఖ, రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ నిరంతర సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది ఇంధన లభ్యతకు సంబంధించిన కచ్చితమైన తాజా సమాచారం కోసం వినియోగదారులు కేవలం అధీకృత సంస్థలు, చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీ) ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని సూచిస్తోంది

# పత్రికా స్వేచ్ఛా...?? లేక ప్రజాస్వామ్యంపై దాడా...??

**నిజం న్యూస్ హైదరాబాద్, జూలై 2:** తెలంగాణ పోలీసులు ఏంచేస్తున్నట్లు...??

జర్నలిజం అనేది సమాజానికి ఒక దిక్సూచి. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం. కానీ, ఈ మధ్య కాలంలో కొందరు ఈ "జర్నలిజం" అనే పవిత్రమైన ముసుగు వేసుకుని, తమ అజెండాలను అమలు చేస్తూ దిగజారుడు తనానికి పాల్పడుతున్నారు కొంతమంది...!!

రాష్ట్రానికి ఒక ముఖ్యమంత్రి అంటే కేవలం ఒక వ్యక్తి కాదు... అది కోట్లాది మంది ప్రజల తీర్పుకు, ఆత్మగౌరవానికి ప్రతిరూపం. ఒక ముఖ్యమంత్రి విధానాలను విమర్శించే హక్కు రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ ఇచ్చింది. కానీ, ఆ విమర్శకు ఒక హద్దు, ఒక పద్ధతి ఉంటాయి...!!

కానీ నేడు కొందరు సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానెళ్లలో జర్నలిస్టుల అవతారం ఎత్తి, సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ని "వాడు", "వీడు", "జోకర్ గాడు" అంటూ అత్యంత అసభ్యకరమైన, అనాగరికమైన భాషలో దూషించడమే కాకుండా, సమాజంలో మరో ప్రమాదకరమైన చిచ్చు పెడుతున్నారు...!!

ప్రశాంత సమాజంలో ప్రాంతీయ విద్వేషాలు ఏంటి...??

ఉమ్మడి రాష్ట్రం విడిపోయి, ఎవరి పాలనలో వారు అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తూ ప్రశాంతంగా జీవిస్తున్న ఈ తరుణంలో... వీరు ఉద్దేశపూర్వకంగా మళ్ళీ ఆంధ్ర - తెలంగాణ అంటూ ప్రాంతీయ వాదాన్ని తెరపైకి తెస్తున్నారు. ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తూ, ప్రజల మనస్సుల్లో పాత గాయాలను రేపి, రెండు ప్రాంతాల మధ్య మళ్ళీ విద్వేషాలు నింపే ఒక కుట్రపూరితమైన ప్రయత్నం జరుగుతోంది...!!

జర్నలిజం ముసుగులో వీరు చేస్తున్న ఈ విషప్రచారం సమాజ ప్రశాంతతను దెబ్బతీయడం కాదా...??

ఇక్కడ ప్రతి సామాన్యుడి మదిలో మెదులుతున్న అతిపెద్ద ప్రశ్న... తెలంగాణ పోలీసులు ఏం చేస్తున్నారో ఏమో అని...??

ఒక సామాన్యుడు ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘిస్తే సీసీ కెమెరాల్లో చూసి మరీ ఇంటికి చలాన్లు పంపే పోలీసులు... రాష్ట్ర అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని బాహాటంగా అవమానిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు...??

భావప్రకటనా స్వేచ్ఛ పేరుతో బజారు భాష మాట్లాడుతుంటే, ప్రజల మధ్య ప్రాంతీయ విద్వేషాలు రగులుస్తుంటే... వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి పోలీసులను అడ్డుకుంటున్నది ఎవరు...??

ఒక ముఖ్యమంత్రినే పట్టుకుని ఎవరైనా ఏమైనా అనొచ్చు, రెండు ప్రాంతాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా విద్వేషాలు నింపొచ్చు, అయినా చట్టం మనల్ని ఏమీ చేయదు అనే తప్పుడు సందేశాన్ని ఈ మౌనం ద్వారా సమాజంలోకి పంపుతున్నారా...??

పత్రికా స్వేచ్ఛను కాపాడటం ఎంత ముఖ్యమో, జర్నలిజం ముసుగులో చేసే బ్లాక్ మెయిల్, అసభ్యకర దూషణలు, ప్రాంతీయ విద్వేషాలను అరికట్టడం కూడా అంతే ముఖ్యం...!!

తెలంగాణ పోలీసుల తీరు చూస్తుంటే... చట్టం తన పని తాను చేయడం మానేసి, ప్రేక్షకపాత్ర పోషిస్తోందా అన్న అనుమానం కలుగుతోంది...ఇప్పటికైనా పోలీసులు ఈ ఫేక్ జర్నలిస్టుల పై ఉక్కుపాదం మోపుతారా...?? లేక చూసీచూడనట్లు వదిలేసి వ్యవస్థల పట్ల ప్రజలకు నమ్మకం పోయేలా చేస్తారా...?? ఇది ప్రతి పౌరుడు ఆలోచించాల్సిన సమయం! సమాజ హితం కోసం, చట్టం అందరికీ సమానంగా పనిచేయాలని ప్రశ్నించాల్సిన సమయం...??

## డీఎస్పీ భీమ్ రెడ్డి నివాసాల్లో ఏసీబీ అధికారుల సోదాలు



**నిజం న్యూస్ హైదరాబాద్, జూలై 2:** హైదరాబాదుతో పాటు ఏకకాలంలో 20 చోట్ల చోదాలు చేస్తున్న ఏసీబీ. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ తనిఖీలు. 8 కోట్ల విలువైన విల్లాల్లో ఉంటున్న భీమ్ రెడ్డి... భారీగా అక్రమాస్తులు గుర్తించిన ఏసీబీ అధికారులు.

## గొట్టుముక్కల పద్మారావు దశదిన కార్యక్రమంలో పాల్గొన్న కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



**నిజం న్యూస్ కూకట్‌పల్లి ప్రతినిధి, జూలై 2:** దివంగత రాజకీయ నేత గొట్టిముక్కల పద్మారావు దశదిన కార్యక్రమం గురువారం వివేకానంద నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ మరియు టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి హాజరయ్యారు. పద్మారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ పరంగా ఉద్యమ సమయంలో ఆయన చేసిన సేవలను రమేష్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తూ.గో. జిల్లాకు చెందిన 20 మంది మహిళల అరెస్ట్



**నిజం న్యూస్ హైదరాబాద్, జూలై 2:** ఒమన్ ఎయిర్‌వేస్‌లో నకిలీ వీసాలతో మస్కట్ వెళ్లేందుకు యత్నం.. మహిళలను అదుపులోకి తీసుకున్న ఇమ్మిగ్రేషన్ అధికారులు. మహిళలను శంషాబాద్ ఔట్‌పోస్టుకు అప్పగించిన అధికారులు. ఏజెంట్ మోసం చేశాడని వాపోయిన మహిళలు

## పద్మశ్రీ గ్రహీత రాజేంద్రప్రసాద్ కి టిడిపి నేత వేజండ్ల కిషోర్ ఘన సన్మానం



**నిజం న్యూస్ కూకట్‌పల్లి ప్రతినిధి, జూలై 2:** ఇటీవల భారత రాష్ట్రపతి చేతులమీదుగా "పద్మశ్రీ" పురస్కారం అందుకున్న నటకిరీటి గద్దె రాజేంద్రప్రసాద్ ని వారి గృహమునందు కలిసి దుశ్శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు వేజండ్ల కిషోర్ బాబు, హేమలత దంపతులు. సకుటుంబసమేత హాస్యభరిత కథానాయకుడిగా ప్రత్యేక వొరవడి సృష్టించడమే కాకుండా కుటుంబకథా చిత్రాలు, మహిళ వేషధారణలో పూర్తి నిడివిగల హాస్య చిత్రం చేసి ప్రేక్షకులను మెప్పించిన ఘనత రాజేంద్రప్రసాద్ కే దక్కుతుంది. వారికి "పద్మశ్రీ" పురస్కారం వరించడం సగటు సినీ అభిమానులుగా సంతోషం వ్యక్తపరచడమైనది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. 48 సంవత్సరాలుగా తమ కుటుంబసభ్యుడిగా ఆదరిస్తూ, ప్రేమాభిమానాలతో ప్రోత్సహిస్తూ వస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకుల ఆశీస్సుల వలనే భారత ప్రభుత్వం గుర్తించి తనకు పద్మశ్రీ పురస్కారం ప్రధానం చేసిందని సంతోషం వ్యక్తపరిచారు. రాజేంద్రప్రసాద్ మరెన్నో ప్రజారంజక చిత్రాలలో నటించడంతో పాటు మరిన్ని పురస్కారాలు, సత్కారాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకోవడమైనది. రాజేంద్రప్రసాద్ కి అభినందనలు తెలిపినవారిలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు వల్లభనేని ధర్మారావు, మురళి రాజు, వెంకట్, పుల్లారావు,కృష్ణారెడ్డి, సాంబశివరావు, బాపూజీ, భాస్కరరావు పాల్గొన్నారు.

## రూపీ డౌన్‌ఫాల్ ఆపకండి! ఆర్బీఐ మాజీ గవర్నర్ షాకింగ్ కామెంట్స్!




డాలర్‌తో రూపాయి మారకం రేటు పడిపోతున్న నేపథ్యంలో ఆర్‌బీఐ తొందరపడి జోక్యం చేసుకోవద్దని మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు సూచించారు. రెపో రేటు పెంపు కంటే ద్రవ్య సరఫరా నియంత్రణ చర్యలే ప్రస్తుతం మేలని పేర్కొన్నారు. వడ్డీ రేట్లపై దూకుడు నిర్ణయాలు జీడీపీ వృద్ధిని దెబ్బతీయవచ్చని హెచ్చరించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం రేటు క్షీణిస్తున్న నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బరావు కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు ఆర్‌బీఐ వెంటనే జోక్యం చేసుకోవద్దని, మరికొంత పతనం సహజ రక్షణగా పనిచేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా దిగుమతుల ఒత్తిడి, చెల్లింపుల సమతుల్యత సమస్యల వంటి బాహ్య ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకోవడంలో బలహీన రూపాయి కొంతవరకు ఉపయోగపడుతుందని చెప్పారు.పశ్చిమాసియా సంక్షోభం, అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావంతో డాలర్‌తో రూపాయి మారకం రేటు ఈ నెల ప్రారంభంలో ఒక దశలో రూ.97.15 స్థాయికి చేరుకుంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి రూపాయి సుమారు 6.1 శాతం క్షీణించగా, అందులో ఎక్కువ భాగం గల్ఫ్ ప్రాంత ఉద్రిక్తతల తర్వాత నమోదైంది. ఈ పరిస్థితుల్లో ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ వచ్చే నెల 3 నుంచి 5 వరకు జరిగే సమావేశంలో కీలక రెపో రేటుపై నిర్ణయం తీసుకోనుంది. ఈ నేపథ్యంలో సుబ్బారావు మాట్లాడుతూ మారకం రేటు సంక్షోభాల్లో ద్రవ్య పరపతి విధానం చివరి అస్త్రం కావాలే తప్ప మొదటి అస్త్రం కాకూడదని స్పష్టం చేశారు.ద్రవ్యోల్బణ నియంత్రణకు వడ్డీ రేట్లు పెంచడం కంటే ద్రవ్య సరఫరా నియంత్రణ చర్యలు ప్రస్తుతం మరింత సమర్థవంతమని అభిప్రాయపడ్డారు. అలాగే రెపో రేటును దూకుడుగా పెంచితే ఆర్థిక కార్యకలాపాలు మందగించి జీడీపీ వృద్ధిపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. మరోవైపు వడ్డీ రేట్లు తగ్గిస్తే ద్రవ్యోల్బణం మరింత పెరగడమే కాకుండా రూపాయి మీద అదనపు ఒత్తిడి ఏర్పడవచ్చని హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితుల్లో విధాన నిర్ణేతలు కంగారు పడుతున్నట్టు కనిపించకుండా సమతుల్య వైఖరితో వ్యవహరించాలని సుబ్బారావు సూచించారు. ప్రస్తుతానికి రెపో రేటును 5.25 శాతం వద్ద కొనసాగిస్తూ, వృద్ధి, ద్రవ్యోల్బణం, మారకం రేటు మధ్య సమతుల్యత సాధించడం ఉత్తమ మార్గమని ఆయన పేర్కొన్నారు.